## క్లుప్తంగా

### జూన్ 4న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని కోనరావుపేట మండలకేంద్రంలో జూన్ 4న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు వేదిక-2 నిజామాబాద్ చైర్‌పర్సన్ ఈ.నారాయణ బుధవారం తెలిపారు. సెస్ పరిధి వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు జూన్ 4న ఉదయం 10.30 గంటలకు కోనరావుపేట రైతు వేదికలో జరిగే సమావేశానికి హాజరుకావాలని సెస్ ఎండీ వి జయేందర్‌రెడ్డి కోరారు. కోనరావుపేట, వేములవాడ పట్టణం, వేములవాడ రూరల్, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను సమావేశంలో చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక రైతు వేదికలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. పంటలకు మోతాదులోనే యూరియా వేయాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. పంటల్లో సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల, వ్యవసాయ శాస్త్రవేత్తలు రజియా సుల్తానా, మాధవి, మండల వ్యవసాయాధికారి సాయికిరణ్, రైతులు తదితరులున్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఎం డి.షరుఫుద్దీన్ పాల్గొన్నారు. ఎంపీవో మీర్జా అఫ్జల్ బేగ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అర్చకులు

బోయినపల్లి: ప్రభుత్వం ధూపదీప నైవేద్య అర్చకులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా అధ్యక్షుడు పార్థసారధి శర్మ కోరారు. కొత్తపేటలో జిల్లా ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పరాంకుశం రమేశ్ మాట్లాడుతూ... ధూపదీప నైవేద్య అర్చకుల నియామకంలో జిల్లా కమిటీ నుంచి అర్చకులను తీసుకునేందుకు ఆలోచించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు కొండమాచార్యులు స్వర్గం రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

### ఇసుక దోపిడీని అరికట్టాలి



ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇసుక దోపిడీని అరికట్టాలని మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ గౌడ్ కోరారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతకాలంగా మండలంలో ఇసుక రీచ్‌లకు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పదిర ఇసుక రీచ్‌నుంచి ట్రాక్టర్ లోడ్‌కు రూ.3,500 చొప్పున తీసుకుంటున్నట్లు తెలిపారు. రాగట్లపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, పదరలో గతంలో కేటాయించినట్లు ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలన్నారు.

### సురక్షిత ప్రాంతాలకు తరలింపు

కోనరావుపేట: కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండగా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వృద్ధులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. గ్రామానికి చెందిన కులేరు పోచవ్వ అనే ఒంటరి మహిళ ఇంట్లోకి వర్షపు నీరు చేరగా గ్రామ కార్యదర్శి ముదాం సతీశ్ ఆధ్వర్యంలో ఆమెను చుట్టుపక్కల వారి ఇళ్లకు చేర్చి సురక్షిత ప్రాంతంలో ఉంచారు.

### క్షీరాభిషేకం



బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట, రేగులపల్లి గ్రామాల ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీనియర్ నాయకులు వారాల నర్సింగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి బుధవారం కొత్తపేట గ్రామంలో క్షీరాభిషేకం చేశారు. ఐరెడ్డి రాజ్యలక్ష్మి, ఐల శివరామ్, ఆకుల అజయ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

**ఘనంగా పోచమ్మ బోనాలు**

ఇల్లంతకుంట: ఓగులాపురంలో బుధవారం లక్కమారి కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# అధ్వానంగా రోడ్లు

- నాలుగేళ్లుగా తండావాసుల ఇబ్బంది
- కష్టంగా మారిన రెండు మండలాల మధ్య ప్రయాణం
- లో లెవల్ వంతెనలతో వర్షాకాలంలో నిలిచిపోతున్న రవాణా



జలపతి తండాలో గుంతలమయంగా రోడ్డు



తారులేచి గుంతలమయంగా మారిన జలపతి తండా - దేవునితండా రోడ్డు

చందుర్తి: మారుమూల గిరిజన తండావాసులు రాకపోకలు సాగించేందుకు గతంలో వేసిన ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో గిరిజన తండాల్లోని రహదారులపై నడిచేందుకు వీల్లేకుండా పోయాయని వాపోతున్నారు. ఈ రహదారులపై రెండు మండలాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రహదారులన్నీ ఛిద్రం కావడంతో ద్విచక్రవాహనదారులకు తిప్పలు తప్పడం లేదని మండలంలోని జలపతి, దేవుని తండావాసులు ఆందోళన చెందుతున్నారు.

**తారు చెదిరింది..**

మండలంలోని దేవుని తండానుంచి జలపతితండా మీద కోనరావుపేట మండలం వట్టిమల్ల శివారులోని పుట్టన్న మల్లన్న ఆలయం వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ తారురోడ్డును నాలుగేళ్ల క్రితం నిర్మించారు. రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు తారురోడ్డు చెదిరిపోయిన భారీ గుంతలు ఏర్పడ్డాయి. తండాల మధ్య తారు రోడ్డంతా చెదిరిపోయింది. కనీసం పాదచారులు నడిచేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో గిరిజనులు ఇతర ప్రాంతాలకు వెళ్లడం కష్టమవుతోంది. రెండేళ్లుగా ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరు కాకపోవడంతో ఈ రోడ్డుకు మోక్షం కలగడం లేదంటున్నారు. ప్రాంత గిరిజనులంతా రోడ్డు మరమ్మతు చేయాలని పలుసార్లు పాలకులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

**అంతంత మాత్రమే ఆర్టీసీ సేవలు**

రోడ్డంతా గుంతలమయంగా కావడంతో గిరిజన తండాలకు ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. గుంతలమయ రోడ్లతో బస్సులు నడిపిందుకు ఆర్టీసీ అధికారులు ససేమిరా అంటున్నారు. ఆర్టీసీ సేవలు ఉదయం, సాయంత్రానికే పరిమితమయ్యాయని వాపోతున్నారు. ఆర్టీసీకి నష్టాలు వస్తున్నా పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ సేవలు అందించేందుకు ఉదయం, సాయంత్రం బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నారు. .

**నిలిచిపోతున్న రాకపోకలు**

జలపతి తండా నుంచి వట్టిమల్ల పుట్టల మల్లన్న ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుపై నాలుగు లోలెవల్ వంతెనలున్నాయి. వర్షాకాలంలో వంతెనలపై రెండు మీటర్ల ఎత్తులో వరద నీటి ప్రవాహంతో రాకపోకలు నెలల తరబడి నిలిచిపోతున్నాయి. వ్యవసాయ పొలాలలకు కూడా వెళ్లే పరిస్థితి లేదని గిరిజనులు వాపోతున్నారు. హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపడితే రాకపోకలకు ఇబ్బందులు తప్పుడుతాయని తెలుపుతున్నారు.

### మరమ్మతు చేయాలి



తారురోడ్డు చెదిరి గుంతలమయంగా మారింది. ఎప్పుడైనా ఊరికి వెళదామంటే నాలుగైదు కిలోమీటర్ల దూరంలో సనుగుల గ్రామానికైనా, వట్టిమల్ల పుట్టన్న మల్లన్న ఆలయం వరకు నడిచివెళ్లి అక్కడినుంచి బస్సు ఎక్కాల్సి వస్తోంది. రోడ్డు బాగుచేస్తే తిప్పలు ఉండవు.

– గుగులోతు రాము, జలపతి తండా, చందుర్తి

### జలపతి తండాకు రోడ్డు వేయలే



సనుగుల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దేవుని, జలపతి తండాలుండేవి. 2018లో దేవుని తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి దేవునితండా పంచాయతీలో జలపతి తండాను విలీనం చేశారు. దేవుని తండాలోని అభివృద్ధి జలపతి తండాలో లేదు. దేవునితండా వరకు రోడ్డును వేసినా జలపతి తండా వరకు రోడ్డు వేయలేదు.

– లకావత్ సంతోష్, జలపతి తండా





ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం నామాపూర్-చిప్పలపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన పగిలిన సీసాలను ఇలా కుప్పగా పడేశారు. కామారెడ్డి ప్రధాన హైవేపై మల్లన్నసాగర్ కెనాల్ పక్కన సేకరించిన వాటిలో పగిలిన బీరు, విస్కీ సీసాలను కుప్పగా పోశారు. ఎవరైన పొరపాటునా అటువైపుపడిపోతే గాయాలపాలయ్యే అవకాశం ఉందని ఆయాగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగిలిన సీసాలను కుప్పగా పోసిన వారిపై చర్యలు తీసుకుని, వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : బి.రాజు, పంచాయతీ కార్యదర్శి, నామాపూర్, సెల్:9866891154

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

# గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు



రాజన్న గోశాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ అర్బన్ : రాజన్న గోశాల నిర్వహణలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయంలో కోడె మొక్కుల ద్వారా ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందన్నారు. పరిశుభ్రత లోపించి కోడెలు మృత్యువాత పడుతున్నాయని, గోశాల సిబ్బంది నిర్లక్ష్యంపై ఆలయ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని , సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ఉపాధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, బుర్ర మనీషా గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తడక రాజు, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల సాయి, బుస్స వంశీ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# విప్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేములవాడ రూరల్ : ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూరల్ మండల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాలకుర్తి పరశురాములు, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నేదూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరిపారు. రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టె ప్రభాకర్, మాజీ సర్పంచులు సంటి యేసు దాసు, ఎనుగంటి శంకర్, బానాల రవీందర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రంగి: నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంపై ఏఎంసీ చైర్మన్ తిరుపతి, మండల కాంగ్రెస్ నాయకులు, హర్షం వ్యక్తం చేశారు. సీం రేవంత్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, ఉపాధ్యక్షుడు మనోహర్, డీసీసీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

### భూసర్వేలో నైపుణ్యం పెంచుకోవాలి

సిరిసిల్ల: భూముల సర్వేలో పూర్తిస్థాయి నైపుణ్యం సాధించాలని సిరిసిల్ల ఆర్డీవో సీహెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. సిరిసిల్ల శివారులోని చంద్రంపేట రైతువేదికలో భూసర్వే శిక్షణ పొందే యువతీ, యువకులకు బుధవారం కిట్లు పంపిణీ చేశారు. భూముల సర్వేలో నైపుణ్యం సాధిస్తే మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు. శాస్త్రీయంగా, ఖచ్చితత్వంతో నిర్ధారిస్తే సమాజంలో నమ్మకం పెరుగుతుందని తెలిపారు. భూసర్వే శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో చెప్పిన ప్రతీ అంశాన్ని నోట్ చేసుకోవాలన్నారు. భూసర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రత్నం, సర్వేయర్లు నాగరాజు, చంద్రమోహన్, మధుసూదన్, చామంతి తదితరులు పాల్గొన్నారు.

### 'ఆది'ని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ వ్యాఖ్యానించారు. బుధవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, ప్రజాభిమానంతో గెలిచిన నాయకుడు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆయనను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సీనియర్ నాయకులు గడ్డం నరసయ్య, వైద్య శివప్రసాద్, బొప్ప దేవయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు అన్నల్దాస్ భాను, నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, రెడ్యానాయక్, రవికుమార్, వేముల రవి, గడ్డం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

వేములవాడఅర్బన్: బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్లారెడ్డిపేట మండలం సింగారం మాజీ సర్పంచ్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని వేములవాడ అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు టౌన్ సీఐ వీరప్రసాద్‌కు నాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. సింగారంలో ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులపై మాజీ అసభ్య పదజాలంతో దూషించారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, నాగుల పూర్ణచంద్, పోచంపల్లి బాను, సంజీవ్‌రెడ్డి, మధు, రాములు తదితరులు ఉన్నారు.

### రాజన్న ఆలయం మూసివేస్తారని తప్పుడు ప్రచారం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయాన్ని జూన్ 15 నుంచి మూసివేస్తారంటూ ఆలయ ఈవో కార్యాలయం నుంచి ప్రెస్‌నోట్ విడుదల చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అవేవి నమ్మొద్దని ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలుపుతూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఫేక్ ప్రెస్‌నోట్, తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

**లక్ష్యంలోపు నిర్మాణం పూర్తిచేయాలి**

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారు ఉంటే ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

● **కేంద్రమంత్రికి వినతి**

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తా నుంచి చంద్రంపేట, కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, మరిమడ్ల మీదుగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి జాతీయ రహదారి వరకు నాలుగు వరసల రోడ్డు నిర్మాణం చేయాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలోని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర హోంశాఖ కార్యాలయంలో బీజేపీ నేతలు నాగుల శ్రీనివాస్, ఎర్రం విజయరామరాజు కలిసి వినతిపత్రం అందించారు.

● **పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**



ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం పాఠశాలలో జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు గోపాల్ రావు, కనకయ్య, సుధాకర్‌రెడ్డి, రాములు, పూర్వ విద్యార్థులు సర్వర్, నగేశ్, ఎల్లం, యాదగిరి, దేవేందర్‌చారి, ఉప్పల చంద్రం, శంకర్, సత్యనారాయణ, శ్రీలత, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


● **మహేశ్‌చంద్రకు సన్మానం**

ఇల్లంతకుంట: బెస్ట్ ప్రాక్టీసెస్ బై ద టీచర్‌పై హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఇల్లంతకుంట జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు మహేశ్‌చంద్ర పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ పలు అంశాలపై ఎగ్జిబిట్ చేశారు. మహేశ్ చంద్రను పాఠశాల సిబ్బంది, హెచ్ఎం ప్రేమలత సన్మానించారు.

● **గుండెపోటుతో రైతు మృతి**

ఎల్లారెడ్డిపేట: గుండెపోటుతో ఓ రైతు మృతిచెందాడు. మండలంలోని రాగట్లపల్లికి చెందిన మందాటి రాములు యాదవ్ (46) తనకున్న ఎకరంన్నర పొలంలో పత్తి సాగుచేశాడు. పంట పెట్టుబడికి, కూతురు వివాహానికి రూ.10లక్షల వరకు అప్పు కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం రాములుయాదవ్ గుండె నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. 108లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య దేవవ్వ, కూతురు రాజలక్ష్మి, కుమారుడు రాకేష్ ఉన్నారు.

● **కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం తరలించాలి**



ఇల్లంతకుంట: నాలుగు రోజులుగా మండలానికి లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం వర్షాలకు తడస్తున్నా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పట్టించుకోవడం లేదని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇల్లంతకుంట పట్టణ అధ్యక్షుడు రఘు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● **ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం**

చందుర్తి: ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదాన్ని హర్షిస్తూ మండలంలోని ఎన్గల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సంఘం నాయకులు, బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముల చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ సంఘం నాయకులు పసుల రవీందర్, దావీదు, స్వామి, గసికంటి క్రాంతి, లింగయ్య, కుమ్మరి శేఖర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **ధాన్యం కొనుగోళ్లలో విఫలం**

చందుర్తి : ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య విమర్శించారు. జోగాపూర్, గుడిపేటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. మండలంలో ఇంకా 40 శాతం ధాన్యం కల్లాల్లోనే ఉందన్నారు. తూకం వేసిన సంచులు ఐకేపీ, సింగిల్‌విండో కేంద్రాల్లో కలిపి 60వేలకు పైగా సంచులు లారీల కొరతతో తరలించకుండా ఉన్నాయన్నారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులున్నారు.

# శ్రమ దోపిడీకి గురవుతున్న బీడీ కార్మికులు



మాట్లాడుతున్న మూషం రమేశ్

సిరిసిల్ల: బీడీ కార్మికులను యజమాన్యాలు ప్రతీనెల దోపిడీ చేస్తున్నాయని, పూర్తిస్థాయి వేతనాలు ఇవ్వకుండా వంచిస్తున్నారని బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు మూషం రమేశ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల బీవై నగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీడీ కార్మికులకు కరువు భత్యం (డీఏ) అన్నీ కలిపి వెయ్యి బీడీలకు రూ.261.40 చెల్లించాలన్నారు. ఏప్రిల్ నెలనుంచి పెరిగిన వేతనం అమలు చేయాలన్నారు. బీడీ కార్మికుల నుంచి యజమాన్యం పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతుందన్నారు. కార్మికుల వద్ద నెలకు ఎన్ని బీడీలు చేసినా 2,000 బీడీల వేతనం కట్ చేసి ఇస్తున్నారని ఆరోపించారు. ఈ లెక్కన ప్రతి నెలా రూ.522.80 కార్మికులు కోల్పోతున్నారని వివరించారు. బీడీ కార్మికులు శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని పేర్కొన్నారు. నగదు బీడీలు చేయిస్తున్న వారిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమేశ్ కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, బీడీ కార్మిక సంఘం నాయకులు సూరం పద్మ, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు స్థానికులకు ఇవ్వాలి



కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక సుతారీ, భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ నాయకులు బుధవారం కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏవో)కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ప్రారంభమవుతున్న తరుణంలో స్థానిక కార్మికులకు పనులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పాలిస్టర్ వస్త్రానికి కూలీ పెంచాలి**

పాలిస్టర్ వస్త్రానికి సంబంధించిన కూలీరేట్లను యజమానులు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు బుధవారం జిల్లా లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కూలి ఒప్పందం ముగిసి ఏడాది దాటిందని, యజమానులు కూలీ పెంచకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కూలీ పెంచకుంటే రానున్న రోజుల్లో పనులు బంద్ చేసి నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డిలు పాల్గొన్నారు.

### 'ఇందిరమ్మ'తో పేదలకు గూడు



కోనరావుపేట: కనగర్తిలో పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ముస్తాబాద్ : ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు గూడు కల్పిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతుగల్‌లో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆఫర్, నాయకులు అంజనేయులు, రాజు తదితరులున్నారు.

కోనరావుపేట: కనగర్తి, ధర్మారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం అధికారులు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకన్న, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, లక్ష్మి,కార్యదర్శి కవితారెడ్డి, నాయకులు శ్రీనివాస్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని, ఈ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, రవీందర్‌రెడ్డి, చెన్ని బాబు, లింగంగౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలకేంద్రానికి చెందిన అల్లాడి ప్రియాంక, గిరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణానికి ముగ్గుపోశారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ కమిటీ సభ్యులు, ఎంపీడీవో, కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గజభీంకార్ రాజన్న

తంగళ్లపల్లి: హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రొటోకాల్ పాటించాలని కలెక్టర్‌ను బీఆర్ఎస్ కోరితే సీఎం ఫొటోలతో కాంగ్రెస్ నాయకులు కొత్త నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. మహాలక్ష్మీ పథకం, తులం బంగారం, కొత్తరేషన్ కార్డులు ఎక్కడని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదని దగా పాలన అని ఎద్దేవా చేశారు. మండలంలో ఇసుక రీచ్ మూసివేయడం వలన గృహ నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ నాయకులు వలకొండ వేణుగోపాల రావు, జక్కుల నాగరాజు, రవీందర్, కొయ్యడ రమేశ్, రాంరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత గుండె వైద్య శిబిరం**

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించారు. వందమందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. సిరిసిల్ల కొత్త బస్టాండ్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పంతం తిరుపతి, గణేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

**వర్షానికి కూలిన పాఠశాల భవనం**

కోనరావుపేట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని మంగళ్లపల్లిలో పాఠశాల భవనం కూలింది. ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గది శిథిలావస్థకు చేరుకుంది. గత కొన్నేళ్లుగా తరగతి గదిని వినియోగించడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తరగతి గది కూలింది.